గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి

హైదరాబాద్ సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ సందర్భంగా గోవుల అక్రమ రవాణాలను అరికట్టాలని అఖిల భారత గో సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి బృందం మంగళవారం డీజీపీకి వినతిపత్రం అందజేశారు. జూన్ 7న జరిగే బక్రీద్ సందర్భంగా రాష్ట్రంలోకి కొన్నివేల గోవులు, ఎద్దులను అక్రమంగా తరలిస్తున్నారు. 1977 గో చట్టాలను అమలు చేయాలని, ఆవులు, ఎద్దులు లేకపోతే భూ తాపం పెరుగుతుందని, పర్యావరణాన్ని ఈ మట్టిని కాపాడాలంటే గో రక్షణ జరగాలని కోరారు. అక్రమంగా తీసుకెళ్తున్న గోవులను కాపాడుతున్న గోరక్షకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, వీటిపై తగు చర్యలు తీసుకోవాలని డీజీపీకి విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. డీజీపీని కలిసిన వారిలో తెలంగాణ గుజరాతి సంఘం అధ్యక్షుడు జిగ్నేష్ దోషి, ఆసరా ఫౌండేషన్ అధ్యక్షుడు గౌరీ వందన, అఖిల భారత గో సేవ ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ రాఘవేందర్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఐ ఎస్‌ఎమ్ బషీర్ అహ్మద్

బస్తీల్లో విదేశీయులుంటే సమాచారం ఇవ్వండి

బంజారాహిల్స్, మే 20 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో విదేశీయులుంటే వెంటనే వారి వివరాలను స్థానిక పోలీసుస్టేషన్‌లో ఇవ్వాలని డీఐ ఎస్‌ఎమ్ బషీర్ అహ్మద్ సూచించారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.10 సింగాడబస్తీవాసులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లను అద్దెకు ఇచ్చేటప్పుడు తప్పనిసరిగా ఆధార్‌కార్డులు తీసుకోవాలని చెప్పారు. చాలామంది దొంగలించిన సెల్‌ఫోన్‌లు కొనుగోలు చేస్తున్నారని, ఇది చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు.



కుమార్ యాదవ్‌తో ఖైరతాబాద్ యాదవులు

ఖైరతాబాద్ యాదవ సంఘం అధ్యక్షుడి ఎన్నిక

ఖైరతాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ యాదవ సంఘం అధ్యక్షుడిగా కంటెబోయిన కుమార్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఖైరతాబాద్ జైన్ భవన్‌లో జరిగిన యాదవుల సర్వసభ్య సమావేశంలో కుమార్ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనతో పాటు కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మానుక పాండు యాదవ్, ప్రధాన కార్యదర్శులుగా మారబోయిన వెంకటేష్ యాదవ్, ఏశబోయిన రాజు(సురేష్) యాదవ్, మానుక గంగాధర్ యాదవ్‌ను ఎంపిక చేశారు. సంఘానికి గౌరవ సలహాదారులుగా మంగళారపు ఆంజనేయులు యాదవ్, కంటెబోయిన వెంకటేష్ యాదవ్, పగడాల మారయ్య యాదవ్, శెట్టి వెంకయ్య యాదవ్, గగనబోయిన కృష్ణ యాదవ్, తదితరులను ఎంపిక చేశామని సమావేశ సమన్వయకర్తలుగా వ్యవహరించిన యాదవ సంఘం హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు మారబోయిన మల్లేష్ యాదవ్, ఖైరతాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు మంగళారపు మల్లిఖార్జున్ యాదవ్ తెలిపారు. కుమార్ యాదవ్ మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతో పూర్తి స్థాయి కమిటీని ఏర్పాటు చేసి యాదవుల సమైక్యతకు, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. యాదవులకు శాశ్వతంగా ఒక కార్యాలయం ఏర్పాటుకు తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు.

లెటర్ రాసి ఇష్టపడిన వ్యక్తితో వెళ్లిన మహిళ

యూసుఫ్‌గూడ, మే 20 (ఆంధ్రజ్యోతి): భర్త ఇంట్లో లేని సమయం చూసి తాను ఇష్టపడ్డ వ్యక్తితో వెళ్లిపోతున్నానని లెటర్ రాసి మహిళ వెళ్లిపోయింది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళరావునగర్‌కు చెందిన శ్రావణి భర్త యు.ప్రసాద్ తరుచూ గొడవపడే వారు. తల్లిదండ్రులు కూతురిని ఇంటికి తీసుకపోయి సర్దిచెప్పి తిరిగి తీసుకవచ్చి భర్త వద్ద ఉంచారు. ఈనెల 10న అత్తామామలకు ఫోన్ చేసి తాను ఓ వ్యక్తి ప్రేమిస్తున్నానని చెప్పింది. 12న డ్యూటీకి వెళ్లి వచ్చే సరికి లెటర్ రాసి ఇంట్లో పెట్టి ఇష్టపడిన వ్యక్తితో శ్రావణి వెళ్లిపోయిందని భర్త ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణ.. ఒకరిపై కేసు

బంజారాహిల్స్, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.14 సర్వే నెంబర్.403లో ప్రభుత్వ స్థలం ఉంది. అబ్దుల్ ఖదీర్ అనే వ్యక్తి పదేపదే స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించగా 2023లో క్రిమినల్ కేసు నమోదైంది. అయినప్పటికీ ఖదీర్ రెండు రోజుల క్రితం స్థలంలోకి అక్రమంగా ప్రవేశించడమే కాకుండా కొన్ని పోస్టర్లు పెట్టాడు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పోస్టర్లను తొలగించారు. అనంతరం షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యంలోకి నీరు, గ్లాసు విషయంలో వివాదం

బంజారాహిల్స్, మే 20 (ఆంధ్రజ్యోతి): మద్యంలోకి నీరు, గ్లాసు విషయంలో వివాదం తలెత్తింది. దీంతో వ్యాపారి దాడి చేయడంతో వాచ్‌మన్ గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనగర్‌కాలనీకి చెందిన గోర్కటి మొగిలి వాచ్‌మన్. ఈనెల 19న మద్యం తాగేందుకు ఇందిరానగర్‌లోని ప్రియాంక్ వైన్స్ వద్దకు వెళ్లాడు. అక్కడ మద్యం కొనుగోలు చేసి పక్కనే ఉన్న షాపులో మంచినీటి ప్యాకెట్, గ్లాసు తీసుకున్నాడు. డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య వివాదం ఏర్పడింది. వ్యాపారి కోపంతో మొగిలిపై దాడి చేశాడు. గాయపడ్డ వాచ్‌మన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకోవాలని బెదిరింపు.. కేసు నమోదు

బంజారాహిల్స్, మే 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకోకపోతే అసభ్యకర చిత్రాలను బహిర్గతం చేస్తానని బెదిరించడంతోపాటు మహిళపైన దాడి చేసిన వ్యక్తి పై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.14 ఇబ్రహీంనగర్‌లో నివాసముండే ఓ మహిళకు 2020లో వివాహమైంది. ఆ తర్వాత విడాకులు అయ్యాయి. అప్పటి నుంచి ఆమె తల్లిదండ్రులతోనే ఉంటుంది. ఇటీవల రాపిడో డ్రైవర్ మహ్మద్ అబ్దుల్ గఫార్‌తో పరిచయం ఏర్పడింది. అతడు పెళ్లి చేసుకుంటానని ఆమెకు మాటిచ్చాడు. ఇదిలా ఉండగా, గఫార్‌కు చెడు అలవాట్లు ఉన్నట్టు మహిళకు తెలిసింది. దీంతో పెళ్లికి నిరాకరించింది. అయితే గఫార్ తన వద్ద ఉన్న అసభ్యకరమైన చిత్రాలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తానంటూ బెదిరించాడు. ఈనెల 19న ఆమె పనిచేస్తున్న ప్రాంతానికి వెళ్లి దుర్భాషలాడుతూ దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సనత్‌నగర్ స్విమ్మింగ్ పూల్ కోచ్ మృతి



నర్సింగ్(ఫైల్)

బేగంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): స్విమ్మింగ్ పూల్ కోచ్ అనారోగ్యంతో మృతిచెందారు. బేగంపేటలోని శ్యామ్‌లాల్ బిల్డింగ్‌లో నివసిస్తున్న నర్సింగ్ సనత్‌నగర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లోని స్విమ్మింగ్ పూల్ కోచ్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. కిడ్నీలు చెడిపోవడంతో కొంత కాలంగా డయాలసిస్ చేయించుకుంటున్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతూ ఇంట్లోనే కుప్పకూలిపోయారు. స్థానిక ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. స్విమ్మింగ్ పూల్ సిబ్బంది నర్సింగ్ మృతదేహానికి నివాళులర్పించారు. సంతాపసూచకంగా స్విమ్మింగ్ పూల్‌ను మూసేశారు.

సీజ్ చేసిన బోరుబావికి కనెక్షన్

- నిబంధనలు పట్టించుకోని యజమాని

బోరబండ, మే 20 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా రోడ్డుపై వేసిన బోరుబావిని రెవెన్యూ అధికారులు సీజ్‌చేయగా, కొన్నిరోజుల తర్వాత సదరు వ్యక్తి దానిని ఉపయోగంలోకి తెచ్చారు. రహ్మత్‌నగర్ డివిజన్ కార్మికనగర్‌లో 6అంగుళాల బోర్‌వెల్‌ను రోడ్డుపై వేస్తున్న విషయాన్ని స్థానికులు ఖైరతాబాద్ మండల రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో అనుమతి లేకుండా వేస్తున్న బోరుబావిని రెవెన్యూ సిబ్బంది సీజ్ చేశారు. అయితే, సీజ్ చేసిన ఆ బోరుబావికి పైపులు వేసుకొని సదరు యజమాని సోమవారం నుంచి ఉపయోగంలోకి తెచ్చుకున్నారు. అది కూడా సిమెంట్ రోడ్డును అనుమతి లేకుండా తవ్వి మరీ కనెక్షన్ ఇచ్చారు. అధికార పార్టీకి చెందిన బస్తీ నాయకుల భరోసాతో సీజ్ చేసిన బోరుబావిని ఉపయోగంలోకి తెచ్చారని స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. సీజ్ చేసిన బోరుబావిని అధికార పార్టీ నాయకులు తెరిపించడం అన్యాయమని వారు పేర్కొంటున్నారు.



కార్మికనగర్‌లో రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన బోరు



సీజ్ చేసిన బోరుబావికి కనెక్షన్ ఇస్తున్న యజమాని

విద్యాహక్కు చట్టం అమలుపై స్పష్టత ఇవ్వాలి



పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్ లింగయ్యకు వినతిపత్రం ఇస్తున్న బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు

ఖైరతాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంపై స్పష్టత ఇవ్వాలని బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. పాఠశాలలను ఏబీసీడీలుగా విభజించి 25 శాతం ఫీజులను ప్రభుత్వమే తల్లిదండ్రులకు చెల్లించేలా నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి నేతృత్వంలో ప్రతినిధి బృందం పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో అదనపు డైరెక్టర్ లింగయ్యను మంగళవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో విద్య, వసతులను పరిగణలోకి తీసుకొని ఫీజులను నిర్ణయించాలని కోరారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లకు ప్రభుత్వం పాఠశాలలకు ఫీజులు చెల్లిస్తామని ప్రతిపాదించారని, దానిని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం పాఠశాలలకు కాకుండా నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో డబ్బులు వేయాలని సూచించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, కోశాధికారి శ్రీనివాసరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు జలందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై అవగాహన



తేనెటీగల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న నిపుణుడు

బోరబండ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎన్‌బీహెచ్‌ఎం సౌజన్యంతో 2022 నుంచి నిమ్స్‌మే ఆధ్వర్యంలో తేనెటీగల పెంపకంపై అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు నిమ్స్‌మే స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ డా.శ్రీకాంత్‌శర్మ తెలిపారు. యూసుఫ్‌గూడలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నిమ్స్‌మేలో ప్రపంచ తేనెటీగల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేనెటీగల పెంపకందారులంతా ఈ వృత్తిని అంకితభావంతో కొనసాగిస్తూ దేశంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను కల్పించేందుకుగాను అధిక తేనె, ఇతర ఉత్పత్తులను పెంపొందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు మధుక్రాంతి పోర్టల్‌లో ఎన్‌రోల్ చేసుకోవాలని కోరారు. తెలంగాణకు చెందిన ప్రముఖ తేనెటీగల ఉత్పత్తిదారులైన జె.అనూష, బి.పృథ్వీరాజ్ మాట్లాడుతూ మెరుగైన మానవ జీవనం కోసం తేనెటీగల పెంపకం, తేనె ఉత్పత్తి ఎంతో అవసరమని పేర్కొన్నారు. తేనెటీగల దినోత్సవం సందర్భంగా నిమ్స్‌మే ప్రాంగణంలో తేనె, ఇతర ఉత్పత్తుల ప్రదర్శన, తేనెటీగల పెంపకం కోసం అవసరమైన పరికరాల ప్రదర్శన నిర్వహించారు. డా. శిరీష్ కులకర్ణి, వీబీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బస్తీల్లో ఫాగింగ్ చేస్తున్న సిబ్బందిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజ్‌కుమార్

దోమల నియంత్రణకు చర్యలు

యూసుఫ్‌గూడ, మే 20 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ బండారి రాజ్‌కుమార్ పటేల్ తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో ఎంటమాలజీ సిబ్బంది చేస్తున్న ప్రత్యేక ఫాగింగ్‌ను అసిస్టెంట్ ఎంటామాలజిస్టు సావిత్రితో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దోమలను లార్వ దశలోనే నిరోధించాలన్నారు. వర్షాకాలంలో చెత్త నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.



ఎర్రమంజిల్ పాఠశాల వద్ద ఆర్‌డీవో, అధికారులతో కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు

ఎర్రమంజిల్ పాఠశాలను తరలించండి

ఖైరతాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగుస్తున్నందున ఎర్రమంజిల్ పాఠశాలను రాబోయే విద్యాసంవత్సరానికి కొత్తగా నిర్మిస్తున్న భవనం చోట తాత్కాలిక ఏర్పాట్లు చేసి తరలించాలని కార్పొరేటర్ విజయారెడ్డి అధికారులను కోరారు. మంగళవారం సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్, విద్యాశాఖ అధికారులతో కలిసి కొత్తగా నిర్మిస్తున్న ఎర్రమంజిల్ పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ఈ యేడాది స్కూల్‌ను నిమ్స్ ఆస్పత్రి విస్తరణ కోసం మూతపడిన చోటే నడిపిద్దామని అధికారులు భావిస్తుండగా అక్కడ సరైన వాతావరణం లేదని, పనులు జరుగుతున్నందున దుమ్ము, అంబులెన్స్‌ల సైరన్లతో పరిస్థితి పిల్లలకు అనుకూలంగా లేదని తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న భవనం సమీపంలో తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసి తరగతులను నిర్వహించవచ్చని, పిల్లలు కొత్త వాతావరణానికి అలవాటు పడి నిర్మాణం పూర్తవగానే కొత్త పాఠశాలలోకి వెళ్తారని సూచించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి శామ్యూల్‌రాజ్, ఇంజనీర్లు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌లు చోరీ

యూసుఫ్‌గూడ, మే 20 (ఆంధ్రజ్యోతి): నాలుగు సెల్‌ఫోన్‌లను ఎత్తుకెళ్లారు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొరుగు రాష్ట్రం కోడూరు నుంచి వచ్చిన ఎన్.ఇమ్మానియేల్, టి.గణేశ్, ఎం.గురుప్రసాద్, పి.మోహన్ కృష్ణకాంత్ పార్కు వద్ద వాహనాన్ని నిలిపి కారులో నిద్రపోయారు. ఉదయం లేచి చూస్తే నలుగురి ఫోన్‌లు మాయమయ్యాయి. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న ఏనుగు శైలజారెడ్డి

డి సన్స్ పటోలా వస్త్ర ప్రదర్శన ప్రారంభం

బంజారాహిల్స్, మే 20 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్‌లోని రోడ్డు నెంబర్.1లో గల లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో కొలువుదీరిన డి సన్స్ పటోలా ఆర్ట్ వస్త్ర ప్రదర్శనను మంగళవారం సామాజికవేత్త ఏనుగు శైలజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'విభిన్నమైన పటోలా ఆర్ట్ చీరలు, పటోలా హ్యాండ్లూమ్, సిల్క్ వస్త్రోత్పత్తులను ఒకే వేదికలో ప్రదర్శించడం అభినందనీయమని అన్నారు. నేరుగా వీవర్ నుంచి వినియోగదారుడికి అందించేందుకు ఏర్పాటైన ఈ ప్రదర్శనను ప్రతీ ఒక్కరు సందర్శించి, మరింత ప్రోత్సహించాలని కోరారు. డి సన్స్ పటోలా ఆర్ట్ నిర్వాహకులు భవిన్ మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో ప్రత్యేక కలెక్షన్స్ వేదికగా పటాన్ పటోలా, బంధాని, బనారసి, చందేరి, కాశ్మీరీ నేత వస్త్రాలు, జరీకోట, మహేశ్వరి, గద్వాల్, ఇక్కత్, తుస్సార్ కాంత, కంచి పట్టు, లక్నోవి సూట్లు, అజ్రక్ సూట్లు, డ్రెస్ మెటీరియల్‌లు, బెడ్‌షీట్లు, ఆభరణాలు వంటి 10 వేల రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. నేత కార్మికులను ప్రోత్సహించడంతోపాటు చేనేత పరిశ్రమకు మార్కెట్‌ను అందించడమే ఈ ఎగ్జిబిషన్ ప్రధాన సామాజిక లక్ష్యం అని వివరించారు.

అప్పుల బాధతో యువకుడు పరార్

యూసుఫ్‌గూడ, మే 20 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఇంటి నుంచి యువకుడు పరారయ్యాడు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా నివాసం ఉండే ప్రేమ్‌చంద్ స్నేహితుల వద్ద సుమారుగా రూ.లక్ష అప్పు చేశాడు. అప్పు ఇచ్చిన వాళ్లు ఇంటికి వచ్చి అడుగుతుండడంతో ఈనెల 17న పారిపోయాడని తండ్రి ఎం.శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

పేదల పక్షపాతి కాంగ్రెస్

● కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

మారేడుపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): పేదోళ్ల గురించి ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ కొనియాడారు. పేదల వైద్య చికిత్సలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆయన అన్నారు. పికెట్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం 24 మందికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేశ్ మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమం, ఆరోగ్యానికి సీఎం రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేసినా సీఎం రేవంత్‌రెడ్డి ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ ప్రాధాన్య రంగాలకు నిధుల లోటు లేకుండా చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ హేమ

మౌలిక వసతుల కల్పనకు కృషి

● కార్పొరేటర్ హేమ

బౌద్ధనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ సామల హేమ ప్రజలకు హామీనిచ్చారు. బ్రాహ్మణబస్తీలో సుమారు రూ.15లక్షల వ్యయంతో చేపడుతున్న వాటర్ పైపులైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌తో ప్రత్యేక చొరవతో డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. ప్రజల సహకారంతో మున్ముందు మరిన్ని అభివృద్ధి పనులు చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ నవ్య, నాయకులు కరాటే రాజు, రాజు సుందరం, శైలేందర్, రవీందర్, సాగర్, కృష్ణముదిరాజ్, అశోక్, ప్రసాద్, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



బంగారు పతకం అందుకుంటున్న డా. శిరీష మేరీ

గాంధీ వైద్యురాలికి స్వర్ణ పతకం

అడ్డగుట్ట, మే 20 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో జనరల్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శిరీష మేరీ బెస్ట్ అవుట్ గోయింగ్ పోస్టు గ్రాడ్యుయేట్ బంగారు పతకానికి ఎంపికయ్యారు. దివంగత పీజీ డాక్టర్ పూర్ణ చందర్‌గుప్త జ్ఞాపకార్థం గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇందిర, ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సునీల్‌కుమార్, జనరల్ సర్జరీ విభాగాధిపతి రాజారాంలు కలసి డాక్టర్ శిరీషకు గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రాన్ని అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.



బోయినపల్లి మార్కెట్‌లోని సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌బాబు

ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు కృషి

● ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌బాబు

సికింద్రాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మార్కెట్‌ను దేశంలోనే ఆదర్శవంతమైన మార్కెట్‌గా తీర్చిదిద్దడానికి తాను కృషి చేస్తున్నట్టు మార్కెట్ కమిటీ చైర్మన్ రాగీరు ఆనంద్‌బాబు తెలిపారు. బోయినపల్లి మార్కెట్ యార్డులో వైస్ చైర్మన్ డీబీ దేవేందర్, కమిటీ సభ్యులు, ఉన్నత శ్రేణి కార్యదర్శి వెంకన్నతో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ కార్యకలాపాలను పరిశీలించారు. మార్కెట్‌లో రైతులకు నష్టం కలగకుండా, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ సిబ్బంది ఉన్నారు.



చీఫ్ వార్డెన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేసవి సెలవులివ్వండి

● చీఫ్ వార్డెన్ డాక్టర్ శ్రీనివాసరావుకు సీఐటీయూ వినతి

ఉస్మానియా యూనివర్సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా యూనివర్సిటీలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు సెలవులు ప్రకటించాలని చీఫ్ వార్డెన్ డాక్టర్ శ్రీనివాసరావుకు ఓయూ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో మంగళవారం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు టి.మహేందర్ మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు హాస్టల్ అండ్ మెస్‌లలో దాదాపు 382 మంది కార్మికులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వారు ఎండాకాలంలో వంటలు చేసేటప్పుడు వేడిని తట్టుకోలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి వారికి వేతనాలతో కూడిన సెలవులు ఇవ్వాలని కోరారు. ఓయూ రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందించి పై అధికారులతో మాట్లాడి సెలవు ప్రకటించే విధంగా ఆలోచిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రావు, ఉపాధ్యక్షులు శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

రహదారి విస్తరణ ఎప్పుడు?

- మూలమలుపుల్లో భయంతోనే ప్రయాణాలు
- ఇరవై ఏళ్లుగా ప్రతిపాదనలకే
- పరిమితమైన రోడ్డు విస్తరణ
- రోజూ నరకం చూస్తున్న వాహనదారులు

బౌద్ధనగర్, మే 20(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గం చిలకలగూడ- వారాసిగూడ- జామై ఉస్మానియా ప్రధాన రహదారిలో మూలమలుపులు ఇరుకుగా ఉండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ ఈ మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డు విసర్తణకు గతంలోనే నిధులు మంజూరైనా ఇప్పటి వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కాలేదు. అధికారులు అప్పుడప్పుడు వారాసిగూడ చౌరస్తా, సీతాఫల్‌మండి, ఆర్ట్స్ కాలేజీలో కొలతలు కొలుస్తూ రోడ్డు విస్తరణ పేరిట హడావిడి చేసి వెళ్తుంటారు. ఇరవై రెండు సంవత్సరాల నుంచి చిలకలగూడ- జామై ఉస్మానియా రోడ్డు విస్తరణ పనులు కలగానే మిగిలి పోతున్నాయి. నగరంలో పలుచోట్ల రోడ్డు విస్తరణ జరిగి ఆయా ప్రాంతాలు అభివృద్ధి జరుగుతుంటే ఈ ప్రాంతం రోజు రోజుకు వెనుకబడి పోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇరవై ఏళ్లుగా నరకం..

ఇరవై రెండు సంవత్సరాల నుంచి చిలకలగూడ- వారాసిగూడ- జామై ఉస్మానియా రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగకపోవడంతో నరకం చూస్తున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారిన రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కావడం లేదు. చిలకలగూడ చౌరస్తా నుంచి జామై ఉస్మానియా వరకు రోడ్డు విస్తరణకు సంబంధించి అధికారులు సిబ్బందితో ఇప్పటికీ మూడు సార్లు మార్కింగ్ చేయించారు. తరువాత రోడ్డు విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలు మూలన పడ్డాయి. జామైఉస్మానియా, బౌద్ధనగర్, ఆర్ట్స్ కాలేజీ, వారాసిగూడ, శ్రీదేవీ నర్సింగ్‌హోమ్, నామాలగుండు, సీతాఫల్‌మండి, మైలార్‌గడ్డ, చిలకలగూడ తదితర ప్రాంతాల నుండి ప్రతిరోజు వేలాదిమంది వివిధ పనుల నిమిత్తం నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. రోడ్డు ఇరుకుగా ఉండడంతో బస్సుల సంఖ్యను తగ్గించారు. అలాగే చిలకలగూడ, సీతాఫల్ మండి, వారాసిగూడ, టర్నింగ్‌పాయింట్ వద్ద మూలమలుపులు ఉండటంతో పాటు రహదారి ఇరుకుగా ఉండడంతో వాహనాలు ఎదురెదురుగా వెళ్లాలంటే డ్రైవర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకైన రోడ్లకు తోడు కొందరు వ్యాపారులు ఉన్న ఇరుకు రోడ్లను ఆక్రమించుకుని వ్యాపారం చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



వారాసిగూడ చౌరస్తా మూలమలుపులో ఆర్టీసీ బస్సుల అవస్థలు

ప్రతిపాదనలకే పరిమితం..

చిలకలగూడ నుంచి జామై ఉస్మానియా వరకు మొదట 60 అడుగుల మేర విస్తరించాలని గతంలో అధికారులు మార్కింగ్ వేసినప్పటికీ.. తరువాత కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో మాస్టార్ ప్లాన్‌లో చిలకలగూడ, సీతాఫల్‌మండి, వారాసిగూడ, టర్నింగ్ పాయింట్ చౌరస్తాలను 80 అడుగులు, మాములు చోట 60 అడుగుల విస్తరించాలని ప్రతిపాదనలు చేశారు. కేసీఆర్ హయాంలో ప్లాట్‌గా 80 అడుగులు విస్తరించాలని ప్రతిపాదనలు చేశారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు విస్తరించేలా ప్రతిపాదనలు సిద్ధం చేసేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ రోడ్డు విస్తరణలో సుమారు 350 ఇండ్లు, వ్యాపార భవనాలు కనుమరుగుకానున్నాయి. రోడ్డు విస్తరణ చేయవద్దని కొంతమంది వ్యాపారులు అడ్డుపడుతున్నట్లు సమాచారం.

మూలమలుపుల వద్ద ప్రమాదాలు



వారాసిగూడ చౌరస్తా, ఆర్ట్స్‌కాలేజీ మూలమలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో రోడ్డువిస్తరణపై జీహెచ్ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి ఫిర్యాదు చేసిన సందర్భాలున్నాయి. వారాసిగూడ చౌరస్తాలో రెండు వాహనాలు ఎదురెదురుగా వెళ్లాలంటే చాలా కష్టమనిపిస్తుంది. ప్రభుత్వం తొందరగా స్పందించి వారాసిగూడ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి.

- ఆనంద్, జామై ఉస్మానియా

రోడ్డు విస్తరణపై దృష్టి సారించాలి



చిలకలగూడ చౌరస్తా నుంచి జామై ఉస్మానియా వరకు రోడ్డు విస్తరణపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలి. ఇరుకుగా ఉన్నా రోడ్డు పక్కన వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రయాణానికి మరింత ఇబ్బంది అవుతుంది. వీలైనంత త్వరగా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తే బాగుంటుంది.

- రాజ్‌కుమార్, వారాసిగూడ

మైనార్టీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి

● సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి

● తార్నాకలో విలేకరుల సమావేశం

తార్నాక, మే 20 (ఆంధ్రజ్యోతి): సామాజికంగా వెనుకబాటుతనానికి గురవుతున్న మైనార్టీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి డిమాండ్ చేశారు. తార్నాకలోని సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మైనార్టీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ప్రొ. సింహాద్రి మాట్లాడుతూ, సామాజిక న్యాయమే ధ్యేయంగా పనిచేస్తున్నామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి అందుకు అవసరమైన కులగణన లెక్కలు ఎందుకు బహిర్గతం చేయలేదని ప్రశ్నించారు. దాదాపు 15 శాతంగా ఉన్న మైనార్టీలకు ఈ సంవత్సరం బడ్జెట్‌లో దాదాపు రూ.3,600కోట్లు కేటాయించినా ఎటువంటి ప్రయోజనం జరగలేదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించి సబ్ ప్లాన్ రూపంలో అందించాలని సింహాద్రి డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం అమలు చేశాకే ఎన్నికలు నిర్వహించాలని ఆయన కోరారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి



తుకారాంగేట్‌లో అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నాగరాజు

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

● సీఐలు శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు

అడ్డగుట్ట, మే 20 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తుకారంగేట్ సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి తుకారంగేట్ పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, వెంకటనగర్, శాస్త్రినగర్, ఇందిరాలక్ష్మినగర్, తుకారంగేట్, సాయినగర్, అడ్డగుట్ట ప్రాంతాల్లో దాదాపు ఐదు గంటల పాటు పర్యటించామని తెలిపారు. రాత్రి వేళల్లో ఎవరు కూడా రోడ్లపై కాలక్షేపం చేయొద్దని సూచించారు. కొత్త వ్యక్తులు కనిపిస్తే అప్రమత్తం కావాలని, రౌడీషీటర్ల ఆగడాలు మితిమీరితే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ కిరణ్‌కుమార్, కానిస్టేబుల్స్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

తిరుమలగిరి: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తిరుమలగిరి సీఐ నాగరాజు అన్నారు. సైబర్ నేరాలు- జాగ్రత్తలు అనే అంశంపై బంజార కాలనీలోని వయోవృద్ధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలన్నారు. కాలనీలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కాలనీలో సీసీ కెమెరాలు పాడయితే వెంటనే బాగు చేసుకోవాలని సీఐ నాగరాజు సూచించారు.

కిమ్స్‌లో ప్రపంచ సుందరీమణుల సందడి

● ఆనందంలో జీఎన్ఎం విద్యార్థులు

రెజిమెంటల్‌బజార్, మే 20 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ సందడి చేశారు. మంగళవారం సాయంత్రం ఆసుపత్రికి చేరుకున్న కంటెస్టెంట్స్ ముందుగా బ్రెస్ట్ క్యాన్సర్ చికిత్స పొందుతున్న వార్డుకు వెళ్లి బాధితులను పరామర్శించి వారిలో ఆత్మవిశ్వాసం నింపారు. అనంతరం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన, నివారణకు ఆస్పత్రి చేస్తున్న సేవలను ప్రశంసించారు.

మెడికల్ రంగంకు చెందిన ఐదుగురు మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్‌ను ఆస్పత్రికి ఆహ్వానించింది. ప్రపంచ సుందరీమణుల రాకపై జీఎన్ఎం విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. పలువురు ఆంధ్రజ్యోతితో తమ ఆనందాన్ని పంచుకున్నారు.

ఆనందంగా ఉంది



ప్రపంచ సుందరీమణుల పోటీలలో పాల్గొంటున్న వారిని టీవీలలో చూడటమే కాని ప్రత్యక్షంగా ఎప్పుడూ చూడలేదు. ఈ రోజు దగ్గర నుంచి చూడడం సంతోషంగా ఉంది. వైద్య రంగం నుంచి పోటీలలో పాల్గొంటుండటం మాకు గర్వంగా ఉంది.

- సోనీ, బీహార్

మరపురాని జ్ఞాపకం



నేను జీఎన్ఎంలో మూడవ సంవత్సరం చదువుతున్నాను. మిస్‌వరల్డ్ కంటెస్టెంట్స్‌ను ప్రత్యక్షంగా చూడడం మరచి పోలేని జ్ఞాపకం. ఇది ఒక మంచి అవకాశంగా భావిస్తున్నాను. వారిని చూస్తుంటే తెలియని ఆనందం కలిగింది.

- పరిమళ, గద్వాల్

హైదారాబాద్‌లో జరగడం గర్వంగా ఉంది



మిస్ వరల్డ్ పోటీలు మన హైదారాబాద్‌లో జరగడం గర్వంగా ఉంది. దీంతో హైదారాబాద్‌కు ప్రపంచ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుంది. దీన్ని చూస్తుంటే ఇది నిజమేనా అనిపిస్తుంది.

- మైనా, కొత్తగూడెం

ఇంటర్న్‌షిప్ విజయవంతం

ఉస్మానియా యూనివర్సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయలోని కేంద్ర పరిశోధనా సదుపాయాల విభాగం (సీఎఫ్ఆర్‌డీ) ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించిన "పరిశోధనా సాంకేతికతలపై ఇంటర్న్‌షిప్" విజయవంతంగా ముగిసింది. మంగళవారం సీఎఫ్ఆర్‌డీ ఈ-క్లాస్‌రూమ్‌లో ముగింపు సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ ప్రమాణాల పరిశోధనా పరికరాలను తక్కువ ఖర్చుతో వినియోగించుకోవడం గొప్ప అనుభూతి అని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఐసీఎంఆర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సందర్శన కూడా కలిసొచ్చిందన్నారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్సెస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. ప్రభాకర్, విద్యార్థులను ఉన్నత స్థితికి ఎదగాలని ప్రోత్సహించారు. విద్యార్థులు మంచి భవిష్యత్ కోసం బలమైన పునాది వేసుకోవచ్చని గౌరవ అతిథి ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ సైంటిస్టు కె.రాజేందర్ రావు అన్నారు. ఈ ఇంటర్న్‌షిప్‌లో 46 మందికి పైగా విద్యార్థులు పాల్గొని ధ్రువపత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సంచాలకురాలు పీటీఎస్ఆర్-సీఎఫ్ఆర్‌డీ డైరెక్టర్ ప్రొఫెసర్ సందీప్త బుర్గుల, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ బి.మంజుల, మహ లకా బాయి చందా మహిళల అధ్యయన కేంద్ర డైరెక్టర్ డా.హమీదా, హెచ్‌సీడీసీ కోఆర్డినేటర్ డాక్టర్ మురళీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్న విద్యార్థులు

అడ్వాన్స్ ఇవ్వమన్నందుకు మహిళపై దాడి

● బేగంపేట పీఎస్‌లో కేసు నమోదు

బేగంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇల్లు ఖాళీ చేసిన అనంతరం అడ్వాన్స్ తిరిగి ఇవ్వమన్నందుకు మహిళపై ఓ వ్యక్తి దాడి చేశాడు. ఈ సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మయూరి మార్గ్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మయూరి మార్గ్‌లోని రవీందర్ ఇంటిని మౌనిక అద్దెకు తీసుకుంది. నెలకు రూ. 6వేలు ఇచ్చే విధంగా మాట్లాడి రెండు నెలల అడ్వాన్స్ రూ.12వేలు చెల్లించింది. నీరు సక్రమంగా ఇవ్వకపోవడంపై పలుమార్లు ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఏప్రిల్ నెలలో మౌనిక ఇంటిని ఖాళీ చేసింది. ఖాళీ చేసే సమయంలో ఒక నెల అద్దె పోగా మిగిలిన రూ.6వేలు ఇస్తానని రవీందర్ ఒప్పుకున్నాడు. డబ్బును తిరిగి ఇవ్వాలని పలుమార్లు ఆమె అతణ్ని అడిగింది. ఎన్నిసార్లు అడిగినా అడ్వాన్స్ ఇవ్వకపోవడంతో ఈ నెల 19న మౌనిక.. ఇంటి యజమాని రవీందర్ ఇంటికి వెళ్లి నగదు ఇవ్వమని అడిగింది. దీంతో వారి మధ్య వాగ్వాదం నెలకొంది. మౌనికపై అసభ్యంగా దూషించిన అతను ఆమెను నెట్టాడు. ఈ క్రమంలో ఆమెకు తీవ్రమైన గాయాలయ్యాయి. జరిగిన సంఘటనపై మౌనిక బేగంపేట పీఎస్‌లో సోమవారం రాత్రి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్విమ్మింగ్‌పూల్ కోచ్ మృతి



నర్సింగ్ (ఫైల్)

బేగంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లో స్విమ్మింగ్‌పూల్ కోచ్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. బేగంపేటలోని శ్యామ్‌లాల్ బిల్డింగ్‌లో నివసిస్తున్న నర్సింగ్ సనత్‌నగర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లోని స్విమ్మింగ్ పూల్ కోచ్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నాడు. కిడ్నీలు చెడిపోవడంతో కొంతకాలంగా డయాలసిస్ చేయించుకుంటున్నాడు. మంగళవారం ఉదయం 11 గంటలకు స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతూ ఇంట్లోనే కుప్పకూలిపోయాడు. స్థానిక ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్విమ్మింగ్ పూల్ సిబ్బంది నర్సింగ్ మృతదేహానికి నివాళులర్పించారు. సంతాప సూచకంగా మంగళవారం మధ్యాహ్నం నుంచి స్విమ్మింగ్‌పూల్‌ను మూసివేశారు.

● టంగుటూరికి నివాళి



టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి పురస్కరించుకుని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి మంగళవారం తార్నాకలోని తన కాంపు కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి

● చెట్టును తొలగించండి



లోత్‌కుంట నుంచి రాష్ట్రపతి నిలయానికి వెళ్లే దారిలో లోత్‌కుంటలోని ఓ చెట్టు ప్రమాదకరంగా మారింది. ఈ చెట్టు కూలడానికి సిద్ధంగా ఉందని, ప్రమాదకరంగా మారిన చెట్టును సంబంధిత అధికారులు తొలగించి, కొత్త చెట్టు నాటాలని స్థానికులు కోరుతున్నారు.

- తిరుమలగిరి, ఆంధ్రజ్యోతి



మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య

ప్రశ్నిస్తే కేసులు పెట్టడం సిగ్గుచేటు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీల అమలులో ఉన్న లోపాలపై సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తే సీఎం రేవంత్‌రెడ్డి కేసులు పెట్టి భయపెట్టాలని అనుకోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడని, పోస్టులు పెడుతున్నాడని తనపై కేసు నమోదైన నేపథ్యంలో మంగళవారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ పోలీసుల ఎదుట బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ వారితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అడ్వకేట్ జక్కుల లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎలాంటి ఇన్వెస్టిగేషన్ లేకుండా విద్యార్థులపై 352 యాక్ట్ ప్రయోగించరాదని సుప్రీం తీర్పు ఉందన్నారు. జంగయ్య మాట్లాడుతూ ఎన్ని కేసులు పెట్టినా, జైల్లో నిర్బంధించినా ప్రజల పక్షాన పోరాటం ఆగదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.